ప్రజాశక్తి
మంగళవారం 20 ఆగస్టు 2024
5



అల్లూరి సీతారామరాజు

పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మరోసారి భారీ వర్షం దంచికొట్టింది. జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులతో కూడిన వానతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఏకధాటిగా గంటసేపు కురిసిన వర్షంతో ఉదయం ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో పలుచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్లపై భారీగా మురుగు నీరు ప్రవహించింది. వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పట్టణంలోని మురుగు కాల్వల సైతం వర్షం నీటితో ప్రవహించాయి. పట్టణంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులకు కృషి చేయాలని, వర్షాలు కురిసినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతులేని విషాదం



బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్

- -కలుషితాహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి
- -80 పైచిలుకు మందికి అస్వస్థత
- -ఉమ్మడి విశాఖలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స
- -కన్నీరుమున్నీరవుతున్న గిరిజన గ్రామాలు
- -కోటవురట్లలోని పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమంలో ఘటన
- -ఆశ్రమం సీజ్, నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - కోటవురట్ల, నర్సీపట్నం, విశాఖ కలెక్టరేట్, చింతపల్లి, పాడేరు విలేకరులు

అనకాపల్లి జిల్లాలో అంతులేని విషాదం చోటుచేసుకుంది. కలుషితాహారానికి విద్యార్థులు బలయ్యారు. చనిపోయిన, అస్వస్థతకు గురైన వారిలో అనాథ పిల్లలే ఎక్కువ మంది ఉండటంతో అందరినీ ఈ ఘటన కలిచివేసింది. కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం వద్దగల పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమం ఈ ఘటనకు మూలంగా నిలిచింది. కలుషిత ఆహారం తినడంతో అక్కడ విద్యనభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. 80 పైచిలుకు మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచీ ఉమ్మడి విశాఖలోని ప్రతి హృదయం బరువెక్కింది.



కెజిహెచ్‌లో విద్యార్థిని

పలువురి కథనం మేరకు.. కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో 90 మంది పైచిలుకు గిరిజన విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా అక్కడే ఉండి ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. వారంతా శనివారం కలుషిత ఆహారం తిన్నారు. వారికి ఆ రోజు మధ్యాహ్నం నక్కపల్లి మండలానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సమోసా, చాక్లెట్లు అందించారు. అలాగే కోటవురట్ల మండలం పొందూరు గ్రామంలో దాసరి లోవరాజు పెదఖర్మ సందర్భంగా వండిన పలావు, వైట్‌రైస్, సాంబారు, పన్నీర్ కర్రీ, పునుకుల కర్రీని రాత్రికి విద్యార్థులకు పెట్టారు. ఆ ఆహార పదార్థాలు అక్కడి పెదఖర్మలో వండగా మధ్యాహ్న భోజనం తరువాత మిగిలిపోతే ఇక్కడికి పంపించారు. అవి తిన్న తరువాత విద్యార్థులు అస్వస్థతకు గురవడం మొదలైంది. చింతపల్లి మండలం నిమ్మలపాలెంనకు చెందిన టి.జాషువా (7) శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఆదివారం రాత్రి చింతపల్లి మండలం బలబద్రం గ్రామానికి చెందిన కొర్ర శ్రద్ధ (7), కొయ్యూరు మండలం రెల్లల పాలెంనకు చెందిన గెమ్మెలి నిత్య (భవాని) (8) మృతిచెందారు. దీంతో సోమవారం ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం విశాఖ కెజిహెచ్‌లో 14 మంది, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో 18 మంది, అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వాసుపత్రిలో 8 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది.

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారు

కెజిహెచ్ చిన్నపిల్లల వార్డులో 14 మందికి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఎస్.రవి, కె.సాయి సంతోష్, టి.అలియా, ఎం.నవీన్, కె.నాగేశ్వరి, కె.మీరా, టి.గీత, పి.జెషికా, జి.జోషిలే, పి.అరవింద్, పి.మౌనిక, పి.జ్యోతి, పి.స్వప్న, పి.మౌనిక ఉన్నారు. వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు.

బాధితులను పరామర్శించిన హోం మంత్రి అనిత

తీవ్ర అస్వస్థతకు గురై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న 14 మంది చిన్నారులను సోమవారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇది ఘోరమైన సంఘటన అని పేర్కొన్నారు. బయట ఫంక్షన్ నుంచి వచ్చిన ఫుడ్ తిని చిన్నపిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించామన్నారు. ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరుపుతామని తెలిపారు. ఇటువంటి అనాథాశ్రమాలు, హాస్టళ్లు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఉన్నా తక్షణం మూసివేయాలని ఆదేశించారు. ఆమె వెంట విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు ఉన్నారు.



కోటవురట్లలో విచారణ చేపడుతున్న అధికారులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

అయ్యన్న దిగ్భ్రాంతి

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితిని ఏరియా హాస్పిటల్ పర్యవేక్షకురాలు డాక్టర్ నీలవేణిదేవిని అడిగి తెలుసుకున్నారు.

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం

ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర నాయకులు పి.అప్పలనర్స, చింతపల్లి మండల కార్యదర్శి సాగిన చిరంజీవి వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఆశ్రమాన్ని నడుపుతున్న వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే చిన్నారుల ప్రాణాలు పోయాయని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నడుపుతున్న ఆశ్రమాలు, హాస్టల్స్ నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆందోళన

మృతులకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని నర్సీపట్నంలో ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ మాట్లాడారు. సిఐటియు జిల్లా నాయకులు కె.గోవిందరావు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గౌతమ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు శివ, అర్జున్, దుర్గా, రవి పాల్గొన్నారు.

విద్య కోసం పంపితే విగత జీవులుగా పంపారు

విద్య కోసం తమ పిల్లలను పంపితే విగత జీవులుగా వారిని తమకు అప్పగించారని మృతుల కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు. కలుషిత ఆహారం తమ పిల్లల ప్రాణాలు తీసిందని వారు చెబుతున్నారు.

అందరితో మాట్లాడాం : అల్లూరి జిల్లా కలెక్టర్

అస్వస్థతకు గురైన అందరితో తాము ఫోన్‌లో మాట్లాడామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ తెలిపారు. వారి అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. పాడేరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది భాదిత విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట జిల్లా ఎస్‌పి అమిత్ బర్దార్, ఎఎస్‌పి ధీరజ్, ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ విశ్వామిత్ర ఉన్నారు.



విశాఖలో ఘటనపై ఆరా తీస్తున్న మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ

విద్యుత్ సమస్యను పరిష్కరించకుంటే

సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తాం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్దమటపల్లి నుంచి సున్నం వారిగూడెం గ్రామం వరకు ఉన్న సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్‌ను త్రీఫేస్ విద్యుత్ లైన్‌గా ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. మండలంలోని రేఖపల్లి కామ్రేడ్ బొప్పెన భీమయ్య భవన్‌లో పంకు సత్తిబాబు అధ్యక్షతన సోమవారం సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ త్రీఫేస్ విద్యుత్తు లేకపోవడంతో రామవరం, చిన్నమట్టపల్లి గ్రామపంచాయతీల ప్రజలు తీవ్రమైన మంచినీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రామవరం, చిన్నమటపల్లి పంచాయతీల ప్రజలకు విఆర్ పురం నుంచి గుణం కొండ మీదుగా రామవరం వరకు త్రీఫేస్ లైన్ ఉందని, ప్రతి ఏటా వరదల వలన విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు పడిపోవడం వల్ల విద్యుత్ సమస్యల తలెత్తి మూడు నెలల వరకు త్రీఫేస్ విద్యుత్ లేక ఆయా పంచాయతీల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెద్దమట్టపల్లి నుంచి సున్నం వారి గూడెం వరకు ఉన్న సింగిల్ ఫేస్ విద్యుత్తు లైన్‌ను త్రీ ఫేస్ లైన్‌గా ఏర్పాటు చేస్తే రామవరం, చిన్నమటపల్లి పంచాయతీల ప్రజల విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కారం చేయవచ్చునని తెలిపారు. కూనవరం విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ చొరవ తీసుకొని తక్షణమే ఈ త్రీఫేస్ లైను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం మండల నాయకులు గుండెపుడి లక్ష్మణరావు, శీరపు తాతబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, ప్రకాష్‌రావు, పులి బుజ్జి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్‌గా

పంకజ్ కుమార్ మీనా బాధ్యతల స్వీకరణ



పంకజ్ కుమార్ మీనా

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్‌గా పంకజ్ కుమార్ మీనా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాహుల్ మీనా ఉద్యోగోన్నతిపై గుంతకల్ రైల్వే ఎస్పీగా బదిలీ అయ్యారు.



ఆర్థిక సాయం అందిస్తున్న టిడిపి నాయకులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అడ్డతీగల : మండల కేంద్రంలోని మద్దిగెడ్డ రిజర్వాయర్‌కి వెళ్ళా దారిలో నివాసముంటున్న మిరియాల నాగరాజు తాటాకుల ఇల్లు ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్ ఆదేశాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం ఉదయం బాధితుడు మిరియాల నాగరాజు కుటుంబానికి బట్టలు, బియ్యం, నిత్యవసర సరుకులు, రూ.3000 వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అడ్డతీగల మండలం సీనియర్ నాయకులు బుర్లే హరిబాబు, ఎడ్ల శీను, అక్కపల్లి పండు, బోండ్ల ప్రభాకర్, ముర్ల సత్యవతి, రాజేశ్వరరావు, చిట్టిబాబు, గొల్ల బాబు, ప్రతీప్, వేగిరాజు, తమ్మి రాజు, నాగేశ్వరరావు, వెంకన్న దొర, వీరబాబు, కృష్ణ, జనసేన నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి, కుప్పాల బాబి, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

బీటలు వారిన బీటీ రోడ్డు

నిర్మాణంలో నాణ్యతా లోపం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ఇటీవల వేసిన బీటీ రోడ్డు కొద్ది నెలల వ్యవధిలోనే బీటల వారింది. నాణ్యత లోపం వల్లే ఇలా జరిగిందని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. రంపచోడవరం మండలం కె.ఎర్రంపాలెం గ్రామం నుండి ఉట్ల మీదుగా బి.వెలమలకోట వరకు, బి.వెలమలకోట నుండి మూలపాడు, జగమట్లపాలెం, బూరుగు బంధం గ్రామాల మీదుగా బంధపల్లి గ్రామం వరకు ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణం చేశారు. ఈ రహదారి వేసిన కొద్ది నెలల్లోనే రోడ్డు ఎడ్జీలలో బీటలు వారి రోడ్డు కింద ఉన్న మట్టి పైకి కనబడుతుంది. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం, సంబంధిత అధికారులు గుత్తేదారులు ఇచ్చే మామూళ్లకు ఆశపడడం వల్ల రోడ్డు నాణ్యత లేకుండా నిర్మించారని స్థానికులు విమర్శిస్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్డు నిర్మాణ పనులలో సరైన నాణ్యత లేకనే రోడ్డు వేసిన కొద్ది రోజుల్లోనే బీటలు వారాయని పలువురు ఆరోపిస్తున్నారు.




బీటలు వారిన కె.ఎర్రంపాలెం- బంధపల్లి బిటి రహదారి



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సూర్యనారాయణ

ఆయాలకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండల పరిధిలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికొన్నత ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు వేతనాలను చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్య నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని కిల్లోగుడ, అడపవలస పాఠశాలల్లో సందర్శించిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో 169 పాఠశాలలు ఉండగా, వీటిలో సుమారు 120 మంది ఆయాలు ఉన్నారని చెప్పారు. పాఠశాలలోని చెత్త చెదారాలను ఎత్తి పారబోయడంతో పాటు ఉదయం, మధ్యాహ్నం రోజు మరుగుదొడ్లు శుభ్రం చేస్తూ పనులు చేస్తున్నారన్నారు. వీరికి ఆరు నెలలుగా జీతాలు అందక అప్పులు చేసుకొని కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు .పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు స్పందించి ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయాలు శాంతి, పూర్ణిమ్మ, సుమిత్ర, తులవతి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని తురకల వలస ప్రభుత్వ, గిరిజన బాలికల పాఠశాలలో అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. కొన్ని ప్రశ్నలు సంధించి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. హాస్టల్లో తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మెనూ ప్రకారం ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలని, దీంట్లో రాజీ పడేందుకు వీలు లేదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూను పాటిస్తూ విద్యార్థులకు సక్రమంగా భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు పాటించాలని, నాణ్యతతో కూడిన గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

ఉపాధి హామీతో గ్రామాల అభివృద్ధి

- 23న గ్రామ సభలు
- ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధికి ఈనెల 23న అన్ని గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో ఉపాధి హామీ పథకం ఏపీడి, డివిజనల్ పంచాయతీ అధికారి, డివిజనల్ డెవలప్మెంట్ అధికారితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సర్పంచ్‌ల అధ్యక్షతన జరగనున్న ఈ గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు గురించి, వేతనదారులకు వారి హక్కులు గురించి తెలియజేయనున్నట్లు చెప్పారు. గ్రామాలలో కావలసిన పనులకు గ్రామసభ ద్వారా తీర్మానాలు చేస్తారన్నారు. సోషల్ ఆడిట్ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామ సభలు నిర్వహణపై రెండు రోజుల ముందు దండోరా వేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో చేసిన పనుల వివరాలు గ్రామ సచివాలయాల నోటీస్ బోర్డ్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. మంజూరైన పనులకు ఉపాధి హామీ ఏపీవోలు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పరివేక్షిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపిడి జి.శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారి రఘునందన్, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులు, ఎటిడబ్లుఒలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

సబ్జెక్టులపై మంచి పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

రంపచోడవరం : ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుండి పదో తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, లెక్కల సబ్జెక్టుల్లో మంచి పట్టు సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఏ సమావేశపు హాల్లో 11 మండలాలకు చెందిన ఎంఇఒలు, ఎటిడబ్ల్యుఒలు, ప్రధానోపాధ్యాయులు, డీఎడ్ లెక్చలర్లు, డీఎడ్ ప్రిన్సిపాల్ తదితరులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు 3 నుండి 10వ తరగతి విద్యార్థులకు బేస్‌లైన్ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయటం, లెక్కలు బాగా చేసే విధంగా విద్యార్థులకు అర్థమయ్యే వరకు ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ సకాలంలో పాఠశాలలకు చేరుకొని అటెండెన్స్ వేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు విద్యతోపాటు భోజన సౌకర్యాలపై ఎప్పటికప్పుడు పరివేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రామ తులసి, కృష్ణమోహన్, డిఎడ్ ప్రిన్సిపాల్ యం.చిన్నిబాబు, ఎంఇఒలు ఎంవివి సత్యనారాయణ, తాతబ్బాయి దొర, వై చిన్న మల్లేశ్వరరావు, లక్ష్మయ్య, యస్.రాజులు, వివి.లక్ష్మీనారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎస్-ఎస్ఏ ఏంఓ భాస్కరరావు, సీఎమ్ఓ జ్ఞాన ప్రకాష్, డిఆర్పి మత్స్య కొండబాబు, డిఈఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణి పాల్గొన్నారు.

శిథిలావస్థలో చిన్న గంగవరం పాఠశాల

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ, చిన్న గంగవరం గ్రామంలో ఎంపీపీ పాఠశాల శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే పరిస్థితిలో ఉంది. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలు కారణంగా పాఠశాల లోపల భాగమంతా కారిపోయింది. దీంతో విద్యార్థులు చదువుకోలేని స్థితి నెలకొంది. పాఠశాలలో పెచ్చులూడి ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రతిరోజూ ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కు బిక్కుమంటు పాఠశాలలో కాలం వెల్లదీస్తున్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదం పొంచి ఉందని అనేకసార్లు అధికారులకు గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు విన్నవించినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడేరు జిల్లా కలెక్టర్, పిఒ వెంటనే స్పందించి విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పాఠశాల నడిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న చిన్న గంగవరం పాఠశాల భవనం

గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గిరిజనుల అనుబంధ ప్రాథమిక సంఘాల నెట్‌వర్క్ ద్వారా గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధరలను సక్రమంగా అందించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. విశాఖపట్నంలోని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని ఆమె నిర్వహించారు. మొట్టమొదటిసారి కార్యాలయానికి విచ్చేసిన మంత్రికి జిసిసి ఎమ్‌డి కల్పనకుమారి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అడవులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాల నుంచి మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ఏ విధంగా సేకరిస్తున్నారని అధికారులను అడిగారు. మిగులు వ్యవసాయ ఉత్పత్తులను గిరిజన రైతుల నుంచి సేకరించడం, విక్రయించిన ఉత్పత్తులకు విలువ జోడించడం, ఆ ఉత్పత్తులకు మెరుగైన అమ్మకపు రాబడిని తేవడం చేయాలన్నారు. జిసిసి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి, లాభాల బాటలో నడపాలని ఆదేశించారు.

ఉపాధి హామీ నిధులతో గ్రామాభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభ ఆమోదం ప్రకారమే ఉపాధి హామీ నిధులతో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని స్థానిక మండల పరిషత్ అధ్యక్షురాలు శెట్టి నీలవేణి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సంబంధిత ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాయుడు సమక్షాన సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని ఉన్న 24 పంచాయతీ కేంద్రాల్లో ఈనెల 29వ తేదీ నుండి పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్ల సమక్షాన గ్రామసభలు ఏర్పాటు చేయాలని సూచించారు. సిసి రోడ్లు, డ్రైనేజీ, పంట కాలువలు ఇతర ముఖ్యమైన అభివృద్ధి పనుల ఏర్పాటుకు తీర్మానాలు పొందుపరచాలని సూచించారు. పంచాయతీ నిధులు గ్రామాల అభివృద్ధికి మంజూరు అవుతాయని, అనంతరం పనులు చేపట్టవచ్చునని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నగేష్, పంచాయతీ కార్యదర్శులు, ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు

వైద్యులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు సరికాదు

ప్రజాశక్తి-పాడేరు : కొలకత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్య, అత్యాచారంపై నిరసిస్తూ ఆందోళన తెలిపి ర్యాలీ చేసిన పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు సుందర్ రావు ఒక ప్రకటనలో ఖండించారు. ఒక మహిళా వైద్యురాలిపై అతి దారుణంగా దాడి చేసి హత్యాచారంకు పాల్పడిన ఘటనలో డాక్టర్లు సిబ్బంది అందరూ కలిసి సంఘీభావ ర్యాలీ చేశారని. తెలిపారు. దానికి అనుగుణంగానే పాడేరులో వివిధ సంఘాల పిలుపుమేరకు 17వ తేదీన వైద్యాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొని కేవలం గంటసేపు సంఘీభావ ర్యాలీ చేశారన్నారు. ఉమ్మడి జిల్లాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలుపగా , అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సంఘీభావం తెలపకుండా ర్యాలీలో పాల్గొన్న వారికి నోటుసులు ఇవ్వడం చాలా , బాధాకరమన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఏదైనా ఇబ్బందులు ఎదురైతే సిబ్బంది తోడుంటారా లేదనుకుంటే ఎవరితోడు ఉంటారో తనకు తాను ప్రశ్నించుకోవాలని సూచించారు. ఆయన కూడా ఒక వైద్యాధికారి అన్న విషయం మర్చిపోయి తోటి వైద్యాధికారులకు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. షోకాజ్ నోటీసులు తక్షణమే వెనక్కు తీసుకొని, ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఏజెన్సీ పదకొండు మండలాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందితో నిరసన చేపడతామని తెలిపారు.

ఎంపిటిసికి ఆర్థిక సాయం



ఎంపిటిసికి నగదు సాయం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి-చింతపల్లి: ఆపదలో ఉన్నవారికి పార్టీ అండగా ఉంటుందనడానికి నిజమైన నిదర్శనం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తనకు అందించిన ఆర్థిక సహాయమే ఉదాహరణ అని చింతపల్లి సెగ్మెంట్ 2 ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, మండల కేంద్రంలో తపాలా శాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై తన భర్త మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా ఛైర్పర్సన్ చిన్న శ్రీను చేతుల మీదుగా విజయనగరంలో సోమవారం చింతపల్లి ఎంపిటిసి జయలక్ష్మికి ఆయన స్వగృహంలో లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు,

పిల్లల విక్రయ అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

- 17 మంది నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పసికందులను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఆరుగురు పసిపిల్లలను రక్షించారు. ఆ కేసు వివరాలను విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత భాగ్చి సోమవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. విశాఖపట్నం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హార్బర్ పార్కు వద్ద ఐదు నెలల చిన్నారిని విక్రయిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని, విచారణ అనంతరం మరొక 15 మందిని విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, గాజువాక, విజయవాడ, నక్కపల్లి ప్రాంతాలలో అరెస్టు చేశామని తెలిపారు. వీరు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, ఢిల్లీలలోనూ పసిపిల్లలను విక్రయిస్తున్నట్టు వెల్లడించారు. టాస్క్ ఫోర్స్ సిఐ కె.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో చాకచక్యంగా తాము పట్టుకున్నట్టు తెలిపారు. తమకు ఉన్న సమాచారం ప్రకారం మొత్తం 15 మంది పిల్లలను వీరు విక్రయించారని, మిగిలిన వారిని కనుగొనే ప్రయత్నం చేస్తున్నామని, విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఈ ముఠాలోని సభ్యులకు ఆసుపత్రులలో వివిధ విభాగాలలో పనిచేసిన అనుభవం ఉందని, ఆ అనుభవంతో పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రులకు పిల్లలను అమ్మటం ప్రారంభించారని తెలిపారు. ఆ పిల్లలను ఐదు నుంచి ఏడు లక్షలకు విక్రయిస్తున్నారని చెప్పారు. విశాఖ నగరంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్, గాజువాక పోలీస్ స్టేషన్ల పరిధిలో వీరిపై ఒక్కొక్క కేసు నమోదయ్యాయన్నారు. మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ కె.ఫకీరప్ప పాల్గొన్నారు.

జిడిపి పెంచడానికి ప్రణాళిక

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : ప్రపంచ దేశాల జిడిపిలో ఐదవ స్థానంలో ఉన్న మన దేశాన్ని 2047 నాటికి మూడవ స్థానం చేరుకునే దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చర్యలు తీసుకుంటున్నారని, అందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వికసిత్ ఆంధ్ర-2047 పేరుతో అభివృద్ధికి కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ జిల్లా అధికారులకు సిపిఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ రంగాలలో 2029 నాటికి 15శాతం అభివృద్ధి సాధించే దిశగా జిల్లా కార్యాచరణ ప్రణాలికలను ఈ నెలాఖరులోగా సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రాధమిక సెక్టార్లయిన వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖలలో ప్రస్తుతమున్న సూచీ ఆదారంగా15శాతం వృద్ధికి కార్యాచరణ చేపట్టాలని, పారిశ్రామిక, ఆర్థిక, విద్య, వైద్య, సేవా, పర్యాటక రంగాలలో 15 శాతం వృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఏ రంగంలో పోటన్సియాలిటి అవకాసం ఉందో ఆయా రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ ఎస్ఎస్ఆర్ కే పట్నాయక్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు ఎస్ బి ఎస్ నంద్, రమేష్ కుమార్‌రావు, శ్రీనివాసరావు, డిసిహెచ్ఎస్ కృష్ణారావు, పరిశ్రమల శాఖ అధికారి వాణిధర్, పర్యాటక అధికారి దాసు, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార ఘటనపై నిరసన



పాడేరులో నిరసన తెలుపుతున్న మహిళలు



డుంబ్రిగుడలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కోల్ కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని చైతన్య స్రవంతి సంస్థ ప్రతినిధి మాలిని డిమాండ్ చేశారు. సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పాత బస్టాండ్ అంబేద్కర్ సెంటర్ వద్ద చైతన్య స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైద్యురాలిని దారుణంగా అత్యాచారం, హత్య చేయడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళలు పాల్గొన్నారు

డుంబ్రిగుడ: కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా విభాగం అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విద్యార్థినిలతో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని గుంటసీమ రోడ్డు నుంచి మండల కేంద్రమైన మూడు రోడ్ల జంక్షన్ మీదుగా బిఎస్ఎన్ఎల్ టవర్ వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక వైద్యాధికారి పి.రాంబాబు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



సీలేరు డిఎవి పాఠశాలలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



రంపచోడవరంలో పిఒ, సబ్‌కలెక్టర్లకు రాఖీలు కడుతున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలో రక్షబంధన్ పండుగను గిరిజనులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కా చెల్లెలు అన్న దమ్ములకు రాఖీలను కట్టి, స్వీట్లు తినిపించి తమ ఆప్యాయతను చాటుకున్నారు. మండల వ్యాప్తంగా రాఖీ పండుగ సందడి నెలకొంది. పర్యాటకులు సైతం రాఖీ పండగ జరుపుకున్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్నదమ్ములకు అక్క చెల్లెలు ఆత్మీయంగా రాఖీలను కట్టి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక డిఏవి పాఠశాలలో విద్యార్థినులు విద్యార్థులకు అన్నదమ్ములతో సమానంగా భావించి రాఖీలు కట్టి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో డిఎవి స్కూలు ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్‌కు రాఖీలు

రంపచోడవరం : రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదివాసి చైతన్య వేదిక ఆధ్వర్యాన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం,సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్‌లకు సోదర భావంతో గిరిజనుల తరపున రాఖీలు కట్టారు. ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ వారు కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షులు వెదుళ్ళ లచ్చిరెడ్డి, పండా చెల్లని దొర, కుంజం.వెంకటేశ్వర్లు దొర, పల్లాల వెంకటరెడ్డి, ఇక నాగన్న దొర, వీరకట్టం స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని ఇద్దరిని ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి -సీలేరు : మతిస్థిమితం కోల్పోయి కొన్ని నెలలుగా జీకే వీధి మండలం సీలేరులోని వీధుల్లో, రోడ్లపై తిరుగుతున్న స్త్రీ, పురుషులు ఇద్దరినీ విశాఖపట్నం మెంటల్ హాస్పిటల్‌లో చేర్చడానికి ఏపీ జెన్కో ఏఈ సురేష్, సీలేరు సర్పంచ్ దుర్జో చర్యలు చేపట్టారు. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ తెలుగు క్యాంపునకు చెందిన గిరిజన యువతి మతిస్థిమితం కోల్పోయి దయనీయ స్థితిలో తిరుగుతుండేది. ఎవరైనా ఆహారం పెడితే ఇష్టం ఉంటే తినడం లేకుంటే విడిచిపెట్టి పారిపోయేది. ఒకానొక సమయంలో ఒంటిపై బట్టలు కూడా ఉండేవి కావు. ఆమె పరిస్థితి గమనించిన సీలేరులో కొందరు మహిళలు బట్టలు ఇచ్చి ఆమెకి తొడిగించే వారు. ఆమె తల్లిదండ్రులు వచ్చి వారి స్వగ్రామానికి తీసుకెళ్లడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా వెళ్ళేది కాదు. ఒకవేళ వెళ్లినా కాలినడకన సీలేరు తిరిగి వచ్చేసేది. కాకినాడకు చెందిన మరో యువకుడు మతిస్థిమితం కోల్పోయి కొద్ది రోజులు డొంకరాయిలో ఉండేవాడు. అనంతరం సీలేరు చేరుకొని ఏడాది నుంచి సీలేరులో తిరుగుతూ గుట్కాలు, మద్యానికి అలవాటుపడ్డాడు. రోడ్లపై తిరుగుతూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. వీటిని గమనించిన సర్పంచ్ దుర్జో, ఏపీ జెన్కో ఏఈ సురేష్ ఇద్దరినీ ఎలాగైనా మెంటల్ హాస్పిటల్ చేర్చాలని నిర్ణయించుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి సౌమ్యను సంప్రదించి మెంటల్ హాస్పిటల్‌కి రిఫరల్ చేయాలని అభ్యర్థించారు. వైద్యాధికారి స్పందించి మెంటల్ హాస్పిటల్‌కి రిఫరల్ రాశారు. దీంతో జెన్కో ఆధ్వర్యంలో నడుస్తున్న సిఎస్ఆర్ అంబులెన్స్‌లో మతిస్థిమితం కోల్పోయిన ఇద్దరిని, వారికి తోడుగా బాధిత మహిళ తల్లిని, మరో యువకుడ్ని ఇచ్చి సోమవారం ఉదయం వైద్య సేవ నిమిత్తం విశాఖపట్నం మెంటల్ హాస్పిటల్‌కి తరలించారు.



అంబులెన్స్‌తో ఆసుపత్రికి తరలిస్తున్న సర్పంచ్ దుర్జో

ఎక్స్‌ప్రెస్ బస్సుకు అల్ట్రా డీలక్స్ ఛార్జీలు

ప్రజాశక్తి -సీలేరు : ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసు నడుపుతూ అల్ట్రా డీలక్స్ బస్ ఛార్జీలు ప్రయాణికుల నుంచి వసూలు చేయడంపై ప్రయాణికులు మండిపడ్డారు. విశాఖపట్నం నుండి చింతపల్లి మీదుగా సీలేరు వచ్చే నైట్ హాల్ట్ ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్ ఆదివారం రాత్రి సీలేరు వచ్చింది. సోమవారం ఉదయం 6 గంటలకు సీలేరు నుండి విశాఖపట్నం బయలుదేరగా, ధార కొండలో ప్రయాణికులు ఎక్కారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్ టికెట్ ధర ప్రకారంగా ఒక్కో ప్రయాణికుడికి ధారకొండ నుంచి విశాఖపట్నం రూ.270 టికెట్ కొట్టవలసి ఉండగా, అందుకు భిన్నంగా అల్ట్రా డీలక్స్ బస్‌ఛార్జి రూ.325 కండక్టర్ కొట్టారు. దీనిపై ప్రయాణికులు ప్రశ్నిస్తే విశాఖపట్నం డిపో ఆర్టీసీ అధికారులు ఆదేశాల మేరకే తాము టికెట్లు కొడుతున్నామని ఆయన తెలిపారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్సులకు అల్ట్రా డీలక్స్ బస్సు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రయాణికునికి ఇచ్చిన టిక్కెట్



సీలేరు, విశాఖ నైట్ సర్వీస్ ఆర్‌టిసి బస్సు

అంగన్‌వాడీ భవనంపై నివేదిక ఇవ్వాలి

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-అనంతగిరి: చెల్లించని బిల్లులు.. అప్పగించని భవనాల పేరుతో ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. స్పందించిన మాతా శిశు సంక్షేమ శాఖ జిల్లా సమగ్ర శిశు సంక్షేమ సేవా పథకపు అధికారిణి అచ్యుత దీనిపై పూర్తి నివేదిక అందించాలని ఐసిడిఎస్ సిడిపిఓ సంతోషి కుమారిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనంతగిరి 1 బొడ్డచెట్టుకాలనీ అంగన్వాడి కేంద్రం నిర్మాణానికి 2018, 19 సంవత్సరంలో పిఆర్ఎస్ డిపార్ట్మెంట్ సుమారు రూ 10 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, ఇందులో ఎన్ఆర్ఈజీఎస్ 5 లక్షలు, శిశు సంక్షేమ శాఖ రూ 2 లక్షలు, రాష్ట్ర అభివృద్ధి నిధుల నుండి 2.5 లక్షలు, పంచాయితీ నిధులు 50 వేలు మొత్తము రూ 10 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు.భవనపు పనులు పూర్తయినప్పటికీ రూము లోపల ఫ్లోరింగ్ పనులతో పాటు మరుగుదొడ్డి ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు 3.56 లక్షలు మాత్రమే బిల్లులు అందాయని, మిగతా బిల్లులు చెల్లించవలసిందని పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారని ఆమె అన్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా సమర్పిస్తామని ఆమె పేర్కొన్నారు

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న విజయభారతి

ప్రజాశక్తి- చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి అన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తాను కళాశాలలో ప్రధానాచార్యురాలిగా బాధ్యతలు చేపట్టే సమయానికి పలు సమస్యలు ఉండేవని, వాటిని పరిష్కరించి కళాశాలకు మంచి రూపు తీసుకు వస్తున్నామన్నారు. విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యలోనే గాక, ప్రతిభ ఉన్న రంగాలలో ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఇందులో భాగంగా క్రీడలు, సాంస్కృతిక, ఇతర రంగాలలో విద్యార్థులను అభివృద్ధి చేయాలన్నదే తన ముఖ్య ఉద్దేశమన్నారు. కళాశాల స్థల రక్షణకు తాత్కాలిక కంచె నిర్మించడంతోపాటు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల వాహనాలను నిలిపి ఉంచేందుకు షెడ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి



పశువైద్యాధికారి డాక్టర్ డికె. చరణ్

ప్రజాశక్తి -హుకుంపేట: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డికె చరణ్ సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం ఈనెల 20వ తేదీ నుండి సెప్టెంబర్ 18 వరకు చేపడతామన్నారు. ఆయన మాట్లాడుతూ, జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా వేయించాలన్నారు.తీవ్రమైన జ్వరం, నీరసం ఎద్దులలో పని సామర్థ్యం తగ్గుట, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయన్నారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం జరుగుతుందన్నారు. పశువులలో గాలికుంటు వ్యాధి టీకాలతో కలిగే లాభాలను పాడి రైతులు తెలుసుకోవాలన్నారు. టీకాలతో దూడలలో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగటానికి ఉపయోగ పడుతుందన్నారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 30 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమానికి 30 అర్జీలు వచ్చాయి. వీటిని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్ట సింహాచలం, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఐటిడిఎ ఏపీఓ జనరల్ సిహెచ్. శ్రీనివాసరావు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సదుపాయాల అందించే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డిఎల్‌పిఓ రఘునందన్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ బాబురావు, రాజశేఖర్, తహశీల్దారు కృష్ణ జ్యోతి, ఏడియంహెచ్ఓ జి.శిరీష, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఇందిరా, డియల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి.యూసఫ్, రవికుమార్, సుబ్బయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

అయ్యవారిగూడెంలో తాగునీటి బోరు

ప్రజాశక్తి- కూనవరం : మండలంలోని అయ్యవారిగూడెంలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో సుమారు 80 కుటుంబాలు నివసిస్తుండగా, తాగునీటి కోసం వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సోమవారం అయ్యవారిగూడెంను సందర్శించి తాగునీటి బోరు రిగ్గును తెప్పించి ట్రస్టు ద్వారా రూ. 51,496 వ్యయంతో బోరు వేయించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎడవల్లి భాస్కర్, ఉమామహేశ్వరరావు, సూఫీ, ఎర్రయ్య, జెకెసి ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, సభ్యులు ఎస్కే షాజహాన్, రియాజ్, ఇంతియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి- చింతపల్లి: మన్య ప్రాంతం నుండిమైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన అందించిన వివరాల ప్రకారం మండలంలోని లంబసింగి కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు అనుమానిత వాహనాలను పట్టుకుని తనిఖీ చేయగా నాలుగు కేజీల గంజాయితో మైదాన ప్రాంతానికి వెళుతున్న నలుగురు వ్యక్తులను తనిఖీ చేసి వారి వద్ద నాలుగు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరిలో గోపి రాజ్, నాగేష్, కార్తీక్, చిరాగ్‌లు ఉన్నారన్నారు. వీరిపై కేసు నమోదు రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు